# ఆ...!!

-వేద ప్రభాస్



ఆ చివరే ఆగిపోయేడు వాడు....!

సన్నగా ఉన్నాడు. జూకా మల్లె పువ్వులాగా ఉన్నాడు. పదేళ్ల పసి వయసు. ఎడారిలో వాలికిపోతున్న వెన్నెలలాగా మెరుస్తోంది. అంతవరకు నాతో వచ్చిన వాడు, అక్కడే.... కాంతారావు గారి ఇంటిగేటు ముందరే ఆగిపోయేడు. బొమ్మలాగా నిలబడి పోయేడు.

నేను కోపంగా మొహం పెట్టి "రావేం..?రా...!" అన్నాను. వాడు కొంత ఇబ్బంది పడుతున్నట్టుగా చూసేడు.

"కుక్కలున్నట్టున్నాయి..." నసిగినట్టుగా అని, రెండడుగులు ముందుకేసేడు.

వాడి భయానికి కారణం అర్థమైంది నాకు.

"మరేం ఫర్వాలేదు... నేనున్నాగా... రా!" అన్నాను.

కాంతారావు గారి డోబర్‌మాన్ కుక్క నాకు బాగా అలవాటే. నన్ను చూడగానే అది, తోకూపుతూ ముందుకు రావడంతో, వాడు గేటు అవతలే ఆగిపోయేడు.

వాణ్ణి చూసి 'షీబూ' మొరిగింది.

అలికిడి విని, కాంతారావు గారు బయటకు వచ్చారు.

"షీబూ... కమ్ హియర్...!" అని దాన్ని కేకేసి, నన్ను అభిమానంగా ఆహ్వానించేరు.

"చాలా రోజులైంది భూషణం...! నువ్వు కనిపించనేలేదు... ధర్మవరం వెళ్లేవు కాబోలు.."

నేను ఆయన వెనకే, ఇంట్లోకి వెళుతూ, వాణ్ణి రమ్మని సైగ చేసేను.

కాంతారావు గారికి నా వ్యవహారాలు తెలుసు. పంట సీజన్లో ధాన్యం వ్యాపారం, శెనక్కాయల వ్యాపారంతో నాకు కొన్నాళ్లు తీరిక లేకుండా పని ఉంటుందని ఆయనకి బాగానే తెలుసు.

నేను కూర్చున్నాక "శెనక్కాయలు ఈ ఏడాది బాగానే పండేయిట... కదా!" అన్నాడాయన.

నాతో మాట్లాడుతూనే ఉన్నా, ఆయన కళ్లు, నా వెనకాతలే, నా కుర్చీ దగ్గర నిలబడ్డ వాణ్ణి పరిశీలించడం నేను చూస్తూనే ఉన్నాను.

"పండడానికేం... బాగానే పండేయి. కానీ

కొంటే కొరివి, అమ్మబోతే అడివీ, అవుతోంది. నేను వ్యాపారం చెయ్యడం కన్నా, చెయ్యక పోతేనే లాభం అన్నట్టుగా ఉంది" అని మొదలు పెట్టి నా కష్టాలన్నీ ఏకరువు పెట్టేను.

కాసేపయ్యాక అడిగేడాయన. "ఏదో పని మీద వచ్చినట్టున్నావు?" వాడెవడు?"

ఆయన వాడి గురించి ఎందుకడిగాడో తెలుసు నాకు. వాడిని నేను వెంట బెట్టుకొ నొచ్చింది ఆయన కోసమే! నాకు ఆయన్తో పని పడింది మరి.

"కొంచెం పైకం సర్దుబాటు చేస్తారని... మీరు ఇంటి పన్లకి కుర్రాణ్ణి చూడమన్నారు కదా! తీసుకొచ్చేను. వీడికెవరూ నా అన్న వాళ్లు లేరు..."

వాడి వంక తిరిగేను.

"దణ్ణం పెట్టరా...! అయ్యగారికి" నేను గద్దించే సరికి వాడు రెండు చేతుల్తో నమస్కారం పెట్టడానికి ప్రయత్నించి చేతులు కలిపేడు. చెత్త కుండీలో ఎంగిలాకులు ఏరుకుంటూ, వీధి కుక్కల్తో కాట్లాడే వాడికి దండం ఎలాగ పెట్టాలో తెలిసి చావలేదు.

"కుర్రాడు చురుగ్గానే కనబడుతున్నాడు. మరి పనెలాగు చేస్తాడో... దొంగ పీనుగ కాదు కదా!" రిటైర్డు డీజీపి కాంతారావు గారు అనుమాన పడ్డాడు.

"అబ్బెబ్బే... అలాంటి వాడు కాదు సుమండీ...! ఆదరించే వాళ్లు లేక అనాధై పోయేడు కానీ మంచివాడు. మీరేం చెపితే అది చేస్తాడు. మీకేం సందేహం అక్కర్లేదు." నేను ఇచ్చిన హామీకి ఆయన సంతృప్తి పడ్డాడు.

"ఏరా...! మా ఇంట్లో పని చేస్తావా....?" సూటిగా వాణ్ణడిగేడాయన.

వాడు తలూపేడు.

మూడ్రోజులుగా తర్ఫీదిచ్చేను వాడికి. రెండు పూటలూ భోజనం పెట్టా. బట్టలిచ్చీ, మంచిమాటలు చెప్పీ, పది రూపాయలు ఖర్చుకిస్తానని ఆశపెట్టీ, పని చెయ్యడానికి వొప్పించేను వాణ్ణి.

"ఇక్కడే ఉండాలి నువ్వు.... చీకటితోనే లేవాలి. మోటారు వేసి టాంకులో నీళ్లు పెట్టాలి. బంగళా అంతా శుభ్రంగా ఊడ్చాలి. అన్నట్టు మర్చిపోయేను. పాల పేకెట్లు తేవాలి. అమ్మగారి పూజకి పువ్వులు కొయ్యాలి. తర్వాత... స్నానాలకి అందరికీ వేడినీళ్లు కాచాలి. గీజరు మేం వాడం... ఇంకా... ఆ నారాయణతో సంచీ పట్టుకుని కూరలకి బజారు వెళ్లాలి. నా కారూ... అబ్బాయి కారూ శుభ్రంగా తుడవాలి..."

నేను వాడి వంక చూసేను.

వాడికాయన చెపుతున్నదేం అర్థమైనట్టు లేదు. ఎలాగవుతుంది? రోజూ వీధులన్నీ తిరిగి చిత్తు కాగితాలు, ఖాళీ ప్లాస్టిక్ సీసాలూ, ప్లాస్టిక్ సంచులూ ఏరుకునే వాడికి...?

ఐనా నాకదంతా అవవసరం.

"మీ అక్క చంపుకు తింటోంది. ఇంటి పన్లకి సరైన కుర్రాడెవరూ కుదిరి చావడం లేదు... ఎవరో ఒకర్ని నువ్వు చూడు భూషణం.... ఏ బాదరబందీ లేనివాడైతే మరీ మరీ మంచిది..." అని ఆయన నాతో చాలాసార్లు చెప్పి ఉండడం వల్ల, ఇప్పుడు ఆయన్తో నాకవసరం రావడం వల్లా, వాణ్ణి తెచ్చేను.

ఆయన తనకవసరం అయిన పన్లు వాడితో చెపుతున్నాడు. ఎవరితోనైనా, ఏ పనైనా ఎలా చేయించుకోవాలో ఆయనకి బాగానే తెలుసు.

వాడికీ అవసరం కనక వాడు చేస్తాడు.

ఎండకి ఎండీ, వానకి తడిసీ, చెత్తకుండీల చుట్టూ తిరిగే దిక్కుమాలిన బతుక్కన్నా... ఇంత నీడ దొరికే బ్రతుక్కనుక చచ్చినట్టు చేస్తాడు...

కాంతారావు గారు ఇంకా ఏవేవో పన్లు చెప్పుకుంటూ పోతున్నాడు.

వాడు వింటున్నట్టే ఉన్నాడు.

ఉన్నట్టుండి, వాడు "ఛీ... అడే.. నీ అమ్మ... నా మీదకి రాకు... నెత్తి పగలగొడ్త," అని అరిచేడు గట్టిగా.

నేను విస్తుబోయి అటు చూసేను.

కాంతారావు గారి డోబర్‌మాన్, వాడి చుట్టూ తిరుగుతూ, నాలిక జాపి 'మూ' చూస్తోంది.

కాంతారావుగారి మొహం వివర్ణమై పోయింది.

నేను వాడి మొహంలోకి చూసేను. వాడి కళ్లల్లో ధైర్యం మెరుపు ఎత్తున మెరిసి పోతోంది.

నేనేదో అనబోయేంతలో....

వాడు, షీబాని లాగిపెట్టి డొక్కలో తన్ని, తీసి ఉన్న గేట్లోంచి తూనీగ లాగా బయటకి దూసుకుపోయేడు. ■